సాక్షి అనకాపల్లి

ఆదివారం । 30 । జూలై । 2023



మార్మోగిన గోవింద నామస్మరణ

విశాఖ: రుషికొండలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు.



సింహగిరి.. భక్తజన సిరి

సింహాచలం: అప్పన్న దర్శనానికి శనివారం భక్తులు బారులు తీరారు. సుమారు రూ.44 లక్షల ఆదాయం లభించింది.



'గొడుగు'ల సంత

ముంచంగిపుట్టు: మన్యంలో వారపు సంతకు మునురు వల్ల ఛత్రాలతో రావడంతో గొడుగుల సంతను తలపించింది.

న్యూస్‌రీల్

భక్తి శ్రద్ధలతో మొహర్రం



అనకాపల్లిలోని జామియా మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అనకాపల్లి టౌన్/కశింకోట: నియోజకవర్గంలో ముస్లింలు మొహర్రంను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలో జామియా మసీదులో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జామియా మసీదు అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.హుసాసెన్ మొహర్రం గురించి వివరించారు. కశింకోట మండలంలోని కశింకోట, బయ్యవరం, తేగాడ, నరసింగబిల్లి, చింతలపాలెం తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసి, పేదలకు దానాలు చేశారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్

- ఐటీఐ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ)లో అప్రెంటిస్‌షిప్‌కు అవకాశం కల్పిస్తున్నట్టు ప్రజారవాణాశాఖ జిల్లా అధికారి కె.పద్మావతి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు ఆగస్టు 1 నుంచి 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ విభాగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో విద్యార్థులకు స్టైఫండ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూ కోసం వచ్చే నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో విజయనగరం వి.టి.అగ్రహారంలోని ప్రజారవాణా శాఖ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీకి హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.apprenticeshipindia.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె తెలిపారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య

అనకాపల్లి టౌన్: స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి మూడో సబ్ జూనియర్ కుస్తీ పోటీలను 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 800 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. రెండురోజులపాటు జరిగే పోటీల్లో గెలుపొందిన వారికి ఆదివారం రాత్రి బహుమతి ప్రదానం చేస్తారు. జిల్లా గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

నవరస మూర్తికి 'సురభి' పురస్కారం



సీతంపేట (విశాఖ): రంగస్థల నటుడు, దర్శకుడు పి.వి.రమణమూర్తి (నవరస మూర్తి)కి సురభి రంగస్థల సేవా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1న ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో జరగనున్న రంగసాయి నాటక సంఘం 13వ వార్షికోత్సవంలో పురస్కారం అందజేస్తామన్నారు.

పుట్టినరోజుకెళ్లొస్తూ.. కానరాని లోకాలకు..

- ఇద్దరు యువకులను బలిగొన్న అతివేగం
- తీవ్రంగా గాయపడిన మరో యువకుడు

-8లో

నమ్ముకున్న వారికి న్యాయం

- అదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లక్ష్యం
- ఇందుకు కోలా గురువులే నిదర్శనం
- వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త సుబ్బారెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న కోలా గురువులు, చిత్రంలో వైవీ సుబ్బారెడ్డి, బూడి ముత్యాలనాయుడు తదితరులు



గురువులను అభినందిస్తున్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, మంత్రి రజని, చిత్రంలో మేయర్ హరివెంకట కుమారి, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

సాక్షి, విశాఖపట్నం: పార్టీని నమ్ముకుని, క్రమశిక్షణతో పనిచేసే వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి న్యాయం చేస్తారని వైఎస్సార్ సీపీ ప్రాంతీయ సమన్వయకర్త, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. అదే సీఎం లక్షణమని చెప్పారు. ఇందుకు కోలా గురువులే నిదర్శనమన్నారు. శనివారం విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నూతన చైర్మన్‌గా కోలా గురువులు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. గతంలో గురువులను చట్టసభల్లో నిలబెట్టాలని ముఖ్యమంత్రి ప్రయత్నించారన్నారు. అయితే ఎమ్మెల్సీ ఎన్నికల్లో చంద్రబాబు కుట్ర, వెన్నుపోటు రాజకీయాల వల్ల గురువులు ఓటమి పాలయ్యారన్నారు. మత్స్యకారుడికి అన్యాయం జరిగిందని ముఖ్యమంత్రి జగన్ గురువులకు డీసీసీబీ చైర్మన్ పదవిని కట్టబెట్టారని చెప్పారు. కాబోయే కార్యనిర్వాహక రాజధానికి జిల్లా అధ్యక్ష పదవిని కూడా ఇచ్చారన్నారు. నర్సీపట్నానికి చెందిన పార్టీ నాయకుడు, డీసీసీబీ పూర్వ చైర్‌పర్సన్ చింతకాయల అనిత భర్త సన్యాసిపాత్రుడుకు భవిష్యత్తులో మంచి పదవినిస్తారన్నారు. డీసీసీబీని సమర్థవంతంగా నిర్వహించాలని, రైతు సమస్యలపై దృష్టి సారించి వారికి సేవలందించాలని గురువులను ఆయన కోరారు.

ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ పార్టీలో అంకితభావంతో పనిచేసే వారికి ముఖ్యమంత్రి జగన్ ఎంతటి ప్రాధాన్యత, గుర్తింపునిస్తారో గురువులే తార్కాణమన్నారు. గురువులు డీసీసీబీకి మంచి పేరు తీసుకురావాలని, బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో కష్టపడి పనిచేసేవారికి సీఎం జగన్ మంచి అవకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. మరే పార్టీలోనూ ఈ తరహా జరగడం లేదని, అలాంటి పార్టీలో పనిచేస్తున్నందుకు గర్వంగా భావిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ మత్స్యకారులంటే సీఎం జగన్‌కు అపారమైన ప్రేమ ఉందన్నారు. మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, పార్టీ విశాఖ జిల్లా అధ్యక్ష పదవులను మత్స్యకారునికే ఇవ్వడం గొప్ప విషయమన్నారు. చంద్రబాబు మత్స్యకారులను తాటతీస్తా, తోలు తీస్తా, అంతు చూస్తా.. అంటూ బెదిరిస్తే ముఖ్యమంత్రి జగన్ వారిని అందలమెక్కిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గొల్ల బాబూరావు, తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, నెడ్‌క్యాప్ చైర్మన్, విశాఖ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌గా బాధ్యతల స్వీకారం

డీసీసీబీ కార్యాలయంలో నూతన చైర్మన్‌గా కోలా గురువులు శనివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గురువులను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. డీసీసీబీ సీఈవో డీవీఎస్ వర్మ, అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ డీసీసీబీ కార్యాలయానికి వచ్చి గురువులుకు అభినందనలు తెలియజేసి వెళ్లారు. తనపై విశ్వాసంతో కీలక పదవులు కట్టబెట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటానని గురువులు చెప్పారు.

చేనేత పరిశ్రమకు చేయూత

- ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి



మాట్లాడుతున్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

నర్సీపట్నం: చేనేత పరిశ్రమను అందరూ ఆదరించి, చేనేత కార్మికుల ఉపాధి కల్పనలో భాగస్వాములు కావాలని ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి కోరారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నర్సీపట్నంలో నూతనంగా నిర్మిస్తున్న మార్కండేయులు ఆలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. చేనేత వస్త్రాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఆప్కోలో ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. చేనేత కార్మికుడు చనిపోతే అందజేసేఆర్థిక సాయాన్ని రూ.12,500 నుంచి రూ.25 వేలకు పెంచినట్టు తెలిపారు. చేనేత కార్మికులకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఆప్కో పనిచేస్తోందన్నారు. ఆప్కోలో నిల్వ ఉన్న చేనేత ఉత్పత్తులను 66 శాతం రాయితీపై ప్రజలకు అందించినట్టు చెప్పారు. చేనేత ఉత్పత్తులకు విస్తృతంగా మార్కెటింగ్ కల్పించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ స్థలాల్లో కొత్తగా షోరూమ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ఆప్కో ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు చెప్పారు. డిసెంబర్ వరకు మొత్తం బకాయిలను చెల్లించామన్నారు. చేనేత సహకార సంఘాల వద్ద ఉన్న ఉత్పత్తులను కొనుగోలు చేయాలన్న సీఎం ఆదేశాలను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్మికులకు అవసరమైన ముడిసరకును 15 శాతం రిబేట్‌పై ప్రభుత్వం సరఫరా చేస్తోందని తెలిపారు. వారంలో ఒక్కరోజైనా చేనేత వస్త్రాలను ధరించి, సమాజానికి నాగరికత నేర్పిన చేనేత రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. నర్సీపట్నంలో దేవాలయం, ఫంక్షన్‌హాలు నిర్మాణానికి తనవంతు సహకారాన్ని అందిస్తానని తెలిపారు. స్థానిక పద్మశాలి సంఘం నాయకులు ఆయనను ఘనంగా సత్కరించారు.

గంజాయి రవాణాపై నిఘా

- ఎస్పీ మురళీకృష్ణ



భీమవరం చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

గొలుగొండ: ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా జరగకుండా కట్టడి చేసేందుకు పోలీసు సిబ్బంది పూర్తి నిఘా ఉంచాలని, ఎప్పటికప్పుడు వాహన తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ మురళీకృష్ణ తెలిపారు. కృష్ణదేవిపేట పోలీసు స్టేషన్ సమీపంలో ఉన్న భీమవరం చెక్‌పోస్టును ఆయన శనివారం తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద పరిస్థితులను పరిశీలించారు. నిత్యం గస్తీ నిర్వహించాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత మాత్రమే విడిచిపెట్టాలని ఆదేశించారు. గంజాయి రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి మైత్రీ గ్రంథాలయాన్ని పరిశీలించి, ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా, నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సేవాభావం.. చిన్నారుల్లో ఆనందం

- 'అరబిందో' ఆర్థిక సాయంతో 2,500 మంది విద్యార్థినులకు సైకిళ్లు
- అనకాపల్లి నియోజకవర్గంలో చేపట్టడం సంతోషదాయకం
- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- అరబిందో ఫార్మా ఎండీ నిత్యానందరెడ్డి చేతుల మీదుగా పంపిణీ

సాక్షి, అనకాపల్లి: 'ఇది ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం కాదు.. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఓట్లు ఉండవు.. ఈ కార్యక్రమం ద్వారా ఏదో లబ్ధి పొందాలన్న ఆలోచన అంతకన్నా లేదు.. నన్ను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు మంచి చేయాలనే తపనే ఈ సైకిళ్ల పంపిణీ అనే అద్భుతమైన కార్యక్రమం వైపు నడిపించింది' అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భావోద్వేగంతో ప్రసంగించారు. సేవా భావం కలిగిన అరబిందో ఫార్మా కంపెనీ యాజమాన్యం.. ప్రజలకు మేలు చేయాలన్న తన సంకల్పం కలిసి చిన్నారులు కళ్లలో వెలుగులు నింపాయన్నారు. 'అరబిందో' సౌజన్యంతో శనివారం ఎన్టీఆర్ స్టేడియంలో అనకాపల్లి నియోజకవర్గ పరిధిలోని 2,500మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు అరబిందో ఎండీ నిత్యానందరెడ్డితో కలిసి సైకిళ్ల పంపిణీ చేశారు. మైదానంలో ఉన్న ప్రతి విద్యార్థిని వద్దకు వెళ్లి సైకిల్ అందజేసి.. ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ.. ఒక్కో సైకిల్ ఖరీదు రూ.6,500 వరకు ఉంటుందని, సుమారు రూ.2 కోట్ల విలువైన 2,500 సైకిళ్లను అందజేశామన్నారు. ఇది అరబిందో సంస్థ ఎండీ నిత్యానందరెడ్డి ఆలోచన అని, తన నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జరగడం ఆనందదాయకమన్నారు. తాను రాజకీయంగా ఈ స్థాయిలో ఉన్నానంటే అందులో నిత్యానందరెడ్డి పాత్ర కూడా ఉందని పేర్కొన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో 'అరబిందో' ఆర్వో ప్లాంట్లు, కల్యాణమండపాలు నిర్మించడంతోపాటు అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు అందుకుంటోందన్నారు. ఇందుకోసం వందల కోట్లు ఖర్చు చేసిన అరబిందో యాజమాన్య సంస్థ సేవలు నిరుపమానమని అభివర్ణించారు.



తమకు అందించిన సైకిళ్లతో విద్యార్థినుల కోలాహలం




విద్యార్థినులకు సైకిళ్లు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్, అరబిందో సంస్థ ఎండీ నిత్యానందరెడ్డి, ఎంపీ సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్

అభివృద్ధి పనులకు సహకారం

అరబిందో ఫార్మా మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ నిత్యానందరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులకు అరబిందో సంస్థ ఎప్పుడూ చేయూతనందిస్తుందన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో ఎటువంటి కార్యక్రమాలు చేయాలన్నా తాను సహకరిస్తానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులంతా చక్కగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులను ప్రోత్సహించడం కోసం ఇటువంటి కార్యక్రమం చేపట్టడం ఆనందదాయకమన్నారు. సేవా కార్యక్రమాలకు ముందుండే అరబిందో ఫార్మా వైస్ చైర్మన్ నిత్యానందరెడ్డిని ఆమె అభినందించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ ఇంత భారీ సేవా కార్యక్రమం ఎప్పుడూ చూడలేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఎప్పుడూ ఏదో మేలు చేయాలని మంత్రి అమర్‌నాథ్ తపన పడుతుంటారని, దానికి నిత్యానందరెడ్డి వంటి సేవాభావం గల వ్యక్తి తోడు కావడం సంతోషకరమన్నారు.

ఈ కార్యక్రమంలో డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, జెడ్పీ ఎస్.వెంకటరమణ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, 83వ వార్డు పార్టీ ఇన్‌చార్జి జాజుల రమేష్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, పార్టీ కశింకోట మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, కొత్తూరు సర్పంచ్ లక్ష్మీప్రసన్న, పార్టీ నేతలు కలగ గున్నయ్యనాయుడు, మలసాల కిషోర్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

2 న పెద్దేరు నుంచి సాగునీరు విడుదల



మాడుగుల: వచ్చే నెల 2వ తేదీ నుంచి పెద్దేరు జలాశయం ప్రధాన పంట కాలువల ద్వారా సాగునీరు విడుదల చేస్తామని జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలపారు. జలాశయం ఆర్ఎంసీ పంట కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, రాచకట్టు కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తామని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 15 వేల ఎకరాల ఆయకట్టు భూములు సాగునీటికి ఢోకా ఉండదని జేఈ తెలిపారు.

కోనాం జలాశయంలో పెరిగిన ఇన్‌ఫ్లో


చీడికాడ: అల్పపీడనంతో కోనాం జలాశయంలోకి నీరు బాగా చేరింది. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 330 క్యూసెక్కులు ఉండడంతో శనివారం ఉదయానికి జలాశయం నీటిమట్టం 98.80 మీటర్లు ఉన్నట్లు ఇరిగేషన్ ఏఈ జయరాం తెలిపారు. జలాశయం ప్రమాద స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 98.80 మీటర్లుగా నమోదయింది. ప్రస్తుత ఇన్‌ఫ్లో ప్రకారం మరో రెండు రోజుల్లో జలాశయం నీటిమట్టం 100 మీటర్లు దాటే అవకాశం ఉంది. అవుట్‌ఫ్లో 10 క్యూసెక్కులు విడుదలవుతోంది. జలాశయం నీటిమట్టం పెరుగుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అనకాపల్లి ➤ తగరపువలస 12 ఫ్లై ఓవర్లు



సిద్ధమవుతున్న డీపీఆర్‌లు

- రూ.600 కోట్లతో కేజీహెచ్ అభివృద్ధి
- జోడుగుళ్లపాలెంలో మత్స్యకారులకు పెడ్లు
- విశాఖ ఇన్‌చార్జి మంత్రి రజని సమీక్ష



సమావేశంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, మంత్రి విడదల రజని, మేయర్ హరివెంకట కుమారి

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో అనకాపల్లి నుంచి తగరపువలస వరకు 12 ఫ్లై ఓవర్లు ఎన్‌హెచ్ఏఐ ద్వారా చేపట్టేందుకు డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని తెలిపారు. విశాఖ తూర్పు, దక్షిణ నియోజకవర్గాల వారీగా అభివృద్ధి, సమస్యలపై శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, జీవీఎంసీ, నాడు–నేడు, గడపగడపకు మన ప్రభుత్వం, ఇతర అంశాలపై జరిగిన సమీక్షలో మంత్రి రజని మాట్లాడారు. ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు కొన్ని పూర్తి కాగా.. మరి కొన్ని పురోగతి దశలో ఉన్నాయని తెలిపారు. .. జిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ కృత నిశ్చయంతో ఉన్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలు సమస్యలు పరిష్కృతమవుతున్నాయని తెలిపారు. కేజీహెచ్‌ను రూ.600 కోట్ల నాడు–నేడు నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రతీ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష చేస్తున్నామని, ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

యలమంచిలి: మండలంలోని కృష్ణాపురానికి చెందిన సిరసపల్లి లక్ష్మణ(20)కు మానసిక స్థితి సరిగా లేక తుని నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. యలమంచిలి – నర్సింగబిల్లి రైల్వే స్టేషన్ల మధ్య పట్టాలపై శనివారం అతడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తుని ప్రభుత్వాస్పత్రిలో శవపంచనామా చేసి బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుడు తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అబ్దుల్ మారుఫ్ తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న రైల్వే పోలీసులు

పుట్టినరోజుకెళ్లొస్తూ.. కానరాని లోకాలకు..

- ఇద్దరు యువకులను బలిగొన్న అతివేగం
- తీవ్రంగా గాయపడిన మరో యువకుడు
- లక్ష్మీపురంలో విషాద ఛాయలు



సంఘటన స్థలంలో హరిప్రసాద్, విష్ణువంశీ మృతదేహాలు (ఇన్‌సెట్) ప్రాణాలతో బయటపడిన కృష్ణంరాజు


హరిప్రసాద్(ఫైల్)


విష్ణువంశీ(ఫైల్)

నర్సీపట్నం: వారంతా స్నేహితులు.. ఎక్కడికెళ్లినా కలిసే వెళ్తుంటారు.. ఈ క్రమంలో తమ మిత్రుడు పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి ఆనందంగా గడిపారు.. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం వారిని కబళించింది. కుటుంబాలకు పెద్ద దిక్కుగా ఉంటారని కలలు కన్న తల్లిదండ్రులకు గుండెకోత మిగిల్చింది. ఈ ఘటన నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

టౌన్ సీఐ ఎస్.గణేష్ వివరాల ప్రకారం... మండలంలోని కొత్తలక్ష్మీపురం గ్రామానికి చెందిన గెడ్డం వెంకటరమణ, పద్మ కుమారుడు హరిప్రసాద్(19), నాతిరెడ్డి సత్తిబాబు, లక్ష్మిల కుమారుడు విష్ణువంశీ(17), ఎలుసూరి కృష్ణంరాజు(16) స్నేహితులు. వీరిలో కృష్ణంరాజు స్నేహితుడు ఎం.మహేష్ పుట్టిన రోజు వేడుకలకు ముగ్గురు అదే రోజు రాత్రి బైక్ నర్సీపట్నం వచ్చారు. ఈ వేడుకలు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు బైక్‌పై డిగ్రీ కళాశాల ప్రాంతం నుంచి బయలుదేరారు. అతివేగంగా రావడంతో ఏరియా ఆస్పత్రి ఎదురుగా స్కేటింగ్ రింగ్ ప్రధాన గేటు వద్ద విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టారు. బైక్ డ్రైవ్ చేస్తున్న హరిప్రసాద్‌తోపాటు విష్ణువంశీల తలకు బలమైన గాయాలవడంతో ఘటన స్థలంలోనే మృతి చెందారు. వీరి వెనుక కూర్చున్న కృష్ణంరాజు తీవ్రంగా గాయపడ్డాడు. విషయం బంధువులకు తెలియడంతో అక్కడికి చేరుకుని క్షతగాత్రుడిని సమీపంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. మృతి చెందిన హరిప్రసాద్ డిప్లొమా పూర్తి చేశాడు. విష్ణువంశీ ఐటీఐ చదువుతున్నాడు. మృతులతోపాటు గాయపడిన యువకుడిది ఒకే గ్రామం కావడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. పుట్టిన రోజు వేడుకలు త్వరగానే ముగిసినప్పటికీ అర్ధరాత్రి వరకు ఎక్కడెక్కడ తిరిగారనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

మరణంలోనూ వీడని స్నేహం..

చిన్ననాటి స్నేహితులుగా కలిసి జీవించిన హరిప్రసాద్, విష్ణువంశీ బంధం మరణంలోనూ వీడలేదు. పోస్టుమార్టం అనంతరం గ్రామ శ్మశానవాటికలో ఇద్దరు మృతదేహాలను పక్కపక్కనే పెట్టి దహన సంస్కారాలు చేసిన హృదయ విదారక సంఘటన గ్రామస్తులను కలిచివేసింది. డిప్లొమా చదివిన హరిప్రసాద్‌కు ప్రైవేట్ కంపెనీలో జాబ్ రావడంతో తల్లిదండ్రులు ఎంతో సంతోషించారు. ఇంతలోనే చేతికందివచ్చిన కుమారుడిని మృత్యువు కబళించడంతో గుండెలవిసేలా రోదిస్తున్నారు. మరో యువకుడు విష్ణువంశీ మరణాన్ని జీర్ణించుకోలేని అతడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

తిమ్మాపురంలో రెండిళ్లలో భారీ చోరీ

- 14 తులాలకుపైగా బంగారం, అర కేజీకిపైగా వెండి వస్తువులు, రూ. 2.42 లక్షలతో ఉడాయింపు


వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

ఎస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురంలో రెండిళ్లలో శనివారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పండగకు, బంధువుల ఇంటికని రెండు కుటుంబాల వారు వెళ్లగా, 14 తులాలకుపైగా బంగారం, అర కేజీకిపైగా వెండి వస్తువులు, రూ. 2.42 లక్షలు ఎత్తుకెళ్లిపోయారు. ఎస్ఐ ప్రసాదరావు వివరాల ప్రకారం.. పులిగా కొండలరావు రెండు రోజుల క్రితం కొత్తకోట మండలం లక్ష్మీపురం గ్రామానికి కుటుంబ సమేతంగా పండగకు వెళ్లి శనివారం సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. అక్కడ ఇంటి తలుపు తాళాలు పగులగొట్టి తెరచి ఉండగా, లోపల వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండటం చూసి కంగుతిన్నారు. 14 తులాల బంగారు నగలు, 40 తులాల వెండి వస్తువులు, రూ. 2.20 పోయినట్టు పోలీసులకు అతడు ఫిర్యాదు చేశాడు. ఇదే ఇంటికి సమీపంలో ఏఎస్ఆర్ రాజు ఇంట్లో అర కేజీ వెండి, రూ.22 వేలు దోచుకున్నారు. ఈ ఇంటి వారు కూడా శుక్రవారం తునిలో బంధువుల ఇంటికి వెళ్లి శనివారం వచ్చి చూడగా చోరీ అయినట్టు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయం తెలియగానే సీఐ అప్పన్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వచ్చి వేలిముద్రలు సేకరించినట్టు చెప్పారు. బాధితులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

539 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు అనుమతులు

- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆర్జేడీ చిన్మయిదేవి


చంద్రయ్యపేటలో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

కె.కోటపాడు : యడ్లవానిపాలెం, చంద్రయ్యపేట గ్రామాల్లో నాడు–నేడు నిధులతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ జి.చిన్మయిదేవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐసీడీఎస్ రీజియన్‌లో ప్రాథమిక పాఠశాలల ఆవరణల్లో 143 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు, బడి బయట కిలోమీటర్ దూరంలోపు 396 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలకు నాడు–నేడు నిధులు మంజూరైనట్టు తెలిపారు. వీటితో పాటు 376 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు పనులకు నిధులు మంజూరైనట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కింద సరుకులను అందించనున్నట్టు తెలిపారు.

కలప వ్యాపారుల సమ్మె బాట

- డీఎఫ్‌వో వేధిస్తున్నారని ఆరోపణ

నర్సీపట్నం: జిల్లా అటవీ అధికారి (డీఎఫ్‌వో) వేధిస్తున్నారని, అందుకు నిరసనగా ఈ నెల 31వ తేదీ నుంచి సమ్మె చేయనున్నామని సామిల్లుల యజమానులు, కలప వ్యాపారులు తెలిపారు. శనివారం వీరంతా పెదబొడ్డేపల్లిలో సమావేశమయ్యారు. సామిల్లుల లైసెన్స్ పునరుద్ధరణకు అధిక మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. అడిగినంత ఇవ్వడం లేదని తరుచూ దాడులు చేసి, కేసులు నమోదు చేసి, లక్షల్లో అపరాధ రుసుం విధిస్తున్నారని వారు పేర్కొన్నారు. డీఎఫ్‌వో వైఖరితో సామిల్లులు మూసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని, అందుకే సోమవారం నుంచి సమ్మెకు నిర్ణయం తీసుకున్నామని వారు తెలిపారు.

కావాలనే బురద జల్లుతున్నారు...

కొంతమంది సిబ్బంది, సామిల్లుల యజమానులు ఏకమై తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని డీఎఫ్‌వో రాజారావు తెలిపారు. విశాఖ నుంచి స్క్వాడ్ వచ్చి ఇక్కడ అక్రమ కలపను పట్టుకొని కేసులు నమోదు చేస్తుంటే తాము ఉండి ఎందుకని ఆయన ప్రశ్నించారు. తనకు వచ్చిన సమాచారం మేరకు సామిల్లులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం వల్లనే తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అక్రమ కలప ముసుగులో సామిల్లులు నిర్వహిస్తామంటే ఉపేక్షించేది లేదన్నారు.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

రేపు మామిడిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

అనకాపల్లిటౌన్: మండలంలోని మామిడిపాలెంలో సోమవారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని ఆయన తెలిపారు. మండలంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

పక్కాగా ఓటరు వెరిఫికేషన్ సర్వే


తుమ్మపాలలో ఓటరు వివరాలను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: ఇంటింటా ఓటరు వెరిఫికేషన్ సర్వేను బీఎల్‌వోలు పక్కాగా నిర్వహించాలని ఆర్డీవో ఎ.జె.చిన్నికృష్ణ ఆదేశించారు. మండలంలోని తుమ్మపాలలో నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 21వ తేదీలోపు ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని చెప్పారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆధార్‌కార్డుతో ఓటరు కార్డును అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. ఎక్కడైన దొంగ ఓట్లు ఉంటే ఆన్‌లైన్‌ల్లో తెలిసిపోతుందని ఆయన చెప్పారు.

5న ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం గౌరీగ్రంథాలయం ఆధ్వర్యంలో ఆగస్టు 5న విశాఖ జిల్లా అగనంపూడి హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం సహకారంతో 'ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్' నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరిశోధనా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ మహంతశెట్టి, విశిష్ట అతిథిగా ప్రివెంటివ్ అంకాలజీ, హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి హెచ్‌వోడీ డాక్టర్ జోల్ రోసా పెర్నాండేజ్ పాల్గొనున్నట్టు చెప్పారు. స్క్రీనింగ్ పరీక్షలు అదేరోజు ఉదయం 9 నుంచి 1 గంట వరకూ నిర్వహిస్తారని, ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9247166511 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 152 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	3,850	3,850
మూడోరకం	3,750	3,750

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
హిడింబ	:	సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	:	సత్యనారాయణ స్క్రీన్-2
హత్య	:	షిర్డిసాయి
పిషిఫ్ ఐపాజిబుల్(తెలుగు)	:	పర్తిసాయి
కార్తీక	:	వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	:	శ్రీసత్య
సామజవరగమన	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 37 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-8 యూనిట్లు, ఎ నెగిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్-16 యూనిట్లు, ఒ పాజిటివ్ - 5 యూనిట్లు, ఒ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 344 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

జ్వరాల కాలం.. జర భద్రం

- ఇంటింటి ఫీవర్ సర్వేతో జ్వర బాధితులు గుర్తింపు
- వ్యాధి తీవ్రంగా ఉన్న వారిపై ప్రత్యేక శ్రద్ధ
- ఒక పక్క అవగాహన.. మరో వైపు నివారణ చర్యలు


జ్వరపీడిత మహిళకు చికిత్స చేస్తున్న వైద్యులు


నీటి నిల్వలు లేకుండా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు

తుమ్మపాల: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. దీంతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిస్తున్నారు.

జ్వరాలు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూనే ఇప్పటికే వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించేందుకు ఇంటింటా ఫీవర్ సర్వే చేపట్టారు. జ్వర బాధితులను గుర్తించిన వెంటనే మందులు పంపిణీ చేయడంతో పాటు తీవ్ర అస్వస్థతకు గురైన వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. మరో పక్క మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పల్లెల్లో తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ, శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేయిస్తున్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు

పట్టణం, మండలంలో పది రోజుల నుంచి ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు, హెల్త్‌సూపర్‌వైజర్లు, తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి జర్వ పీడితుల వివరాలు సేకరిస్తున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారి రక్తనమూనాలు సేకరించి మలేరియా, డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు.అవసరమైన వారిని సమీపంలో ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందిస్తున్నారు. వైరల్ జ్వరాలతో ఉన్నవారికి మందులు అందిస్తున్నారు.

దోమల నివారణ, డ్రైడేపై అవగాహన

వారంలో ప్రతి శుక్రవారం డ్రైడేపాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించడం, ఇంటిలో ఫ్రిడ్జ్,డ్రమ్ములు, టబ్‌లను ఖాళీ చేసి శుభ్రపరచడంతో దోమల వృద్ధి నిరోధించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి సంబంధిత సచివాలయం, మున్సిపల్ సిబ్బంది ద్వారా శుభ్రం చేసేలా వెక్టార్ హైజీన్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. వాటిని ఆరోగ్య కార్యకర్త పరిశీలించి నీటినిల్వలు తొలగించినట్టు నిర్ధారణ చేస్తున్నారు.

శరవేగంగా ఫీవర్ సర్వే

మండలం, పట్టణంలో దాదాపు 65 వేల కుటుంబాలు ఉండగా, ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటి ఫీవర్ సర్వే శర వేగంగా జరుగుతోంది.మండలంలో మొత్తం 32,592 గృహాలు ఉండగా, ఇప్పటి వరకు 18,564 గృహాల్లో సర్వే పూర్తి చేశారు. పట్టణంలో 30,246 గహాలకు గాను 24,320 ఇళ్లలో సర్వే పూర్తయింది. పలు గ్రామల్లో వలంటీర్లు ఫీవర్ సర్వే పూర్తిచేశారు. ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యులు పూర్తి ఆరోగ్య పరిస్థితులపై వివరాలు నమోదు చేసి, వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. మండలంలో తుమ్మపాల, తగరంపూడి పీహెచ్‌సీల పరిధిలో 26 సచివాలయాలు ఉండగా వాటిలో దాదాపు సగం గ్రామాల్లో ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. పట్టణంలో 27 సచివాలయాల పరిధిలో కూడా దాదాపు పూర్తికావచ్చింది.

ఇంటి వద్దే మందులు ఇచ్చారు

తీవ్ర జ్వరంతో బాధపడుతుండడం గుర్తించి నేరుగా ఇంటి వద్దకే వచ్చి మందులు అందించారు. పరీక్షలు చేసి జాగ్రత్తలు చెప్పారు. ఇప్పుడు జ్వరం తగ్గుముఖం పట్టింది. జ్వరం రావడంతో నీరసమై ఇంటి వద్దనే ఉన్న నన్ను వలంటీర్ గమనించి ఏఎన్ఎంకు చెప్పాడు. ఆమె వెంటనే మా ఇంటికి వచ్చి చికిత్స అందించింది.

– మంత్రి పద్మ, బవులువాడ

వ్యాధుల నివారణే లక్ష్యంగా సర్వే



వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులు, జ్వరాల నివారణే లక్ష్యంగా గ్రామస్థాయిలో పూర్తి చర్యలు తీసుకుంటున్నాం. ఫీవర్ సర్వే ద్వారా గుర్తించిన రోగులకు సకాలంలో మందులు పంపిణీ చే స్తున్నాం. డెంగ్యూ, మలేరియాపై ప్రజల్లో పూర్తి అవగాహన కలిస్తున్నాం. వర్షాకాలంలో ఎక్కడా నీరు నిల్వ లేకుండా సూచనలు చేస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వర్షాల కారణంగా వాతవరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. చల్లని వాతావరణ దృష్ట్యా వేడి పదార్థాలను, వేడి నీటిని తీసుకోవాలి.

–డాక్టర్ ఎస్.వి.జగదీశ్వరి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి

అగ్రి గోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న అగ్రి గోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: అగ్రి గోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించి వారిని ఆదుకోవాలని అగ్రి గోల్డ్ కస్టమర్స్,ఏజెంట్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కరణం మాణిక్యాలరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సంఘం గౌరవాధ్యక్షుడు వైఎస్ భద్రం మాట్లాడుతూ ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న అగ్రి గోల్డ్ బాధితుల సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

ఐద్వా బస్సు యాత్రను విజయవంతం చేయాలి


పోస్టర్ ప్రదర్శిస్తున్న ఐద్వా సభ్యులు

అనకాపల్లి రూరల్: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్న డిమాండ్‌తో ఐద్వా ఆధ్వర్యంలో జరుగుతున్న బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న బస్సుయాత్ర ఈ నెల 31న అనకాపల్లి పట్టణానికి చేరుకుంటుందని ఇక్కడ జరిగే సమావేశానికి మహిళలంతా పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆమె కోరారు.ఈ మేరకు పట్టణంలోని దొడ్డి రామునాయుడు భవనంలో పోరు యాత్ర బస్సు యాత్ర పోస్టర్‌ను ఐద్వా జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రదర్శించారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆర్ లక్ష్మి,సభ్యులు గుడాల లావణ్య,ఏ మణి,పార్వతి పాల్గొన్నారు.

యలమంచిలిలో చోరీ

- 6 తులాల బంగారం, 5 తులాల వెండి వస్తువుల అపహరణ

యలమంచిలి: పట్టణంలోని పాత ఎస్‌బీఐ కాలనీలో వలంటీరు శ్యామకుమారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం చోరీ చేశారు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు వివరాల ప్రకారం... శ్యామకుమారి తన కుటుంబ సభ్యులతో బంధువుల ఇంటికి వెళ్లింది. ఇదే అదనుగా చేసుకుని ఆమె ఇంట్లో బీరువాలో ఆరు తులాల బంగారం, ఐదు తులాల వెండి వస్తువులను ఎత్తుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ క్లూస్‌టీంతో వెళ్లి ఇంట్లోను, పరిసరాలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జిల్లా స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు నేడు

అనకాపల్లి టౌన్: స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో ఆదివారం సాయంత్రం జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్, అబ్దుల్ కలాం సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మిస్టర్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, సేవా సంఘం వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో వంద మంది క్రీడాకారులు పాల్గొంటారని, ముందుగా వారి పేర్లు అసోసియేషన్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

ఉపాధి పథకంలో సాగునీటి కాలువలు శుభ్రం


మునగపాకలో సాగునీటి కాలువలో ప్రవహిస్తున్న నీరు

మునగపాక : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పలు సాగునీటి కాలువల రూపురేఖలు మారుతున్నాయి. ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని కాలువలు నేడు ఈ పథకం ద్వారా వినియోగంలోకి వస్తున్నాయి. గతంలో సాగునీరు ప్రవహించే పరిస్థితులు కనిపించేవి కావు. నేడు ఉపాధి హామీ పథకం ద్వారా కాలువలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. తద్వారా ఎగువ నుంచి దిగువ ప్రాంతాలకు సాగునీరు పుష్కలంగా పారుతుంది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే చర్యలు

మునగపాక : ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటపుడు జాగ్రత్తలు పాటించాలని ఏఎస్ఐ మన్మథరావు కోరారు. శనివారం ఆయన మునగపాకలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఓపెన్ జిమ్ పరికరాలను బాగుచేయాలి


పాడైపోయిన పరికరం

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలోని ఓపెన్ జిమ్‌లో పాడైపోయిన పరికరాలను తక్షణమే బాగుచేయాలని క్రీడామైదానం వాకర్స్ అండ్ వాకర్స్ అధ్యక్షుడు యడ్ల త్రినాథ్ కోరారు. క్రీడామైదానంలో ఉదయం, సాయంత్రం సమయాల్లో వేలాది మంది క్రీడాకారులతో పాటు, వృద్ధులు, యువకులు వ్యాయామం చేస్తున్నారని, క్రీడాపరికరాలు పాడైపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తోందని చెప్పారు. పరికరాలు బాగుచేయడంతో పాటు మైదానంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

బీజేపీలో నియామకాలు

అనకాపల్లిటౌన్: బీజేపీలో పలు విభాగాలకు కన్వీనర్లను నియమించారు. సోషల్ మీడియా జిల్లా సెల్ కన్వీనర్‌గా రాంబిల్లి మండలం, వాడనరసాపురం గ్రామానికి చెందిన సురాడ నూకరాజు, జిల్లా ఆర్టీఐ సెల్ కన్వీనర్‌గా అనకాపల్లి పట్టణం గాంధీనగరానికి చెందిన కామేశ్వరరావు, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్‌గా ఎస్.రాయవరం మండలం కొత్తపోలవరం గ్రామానికిచెందిన డి.నూకరాజులను ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు శనివారం నియమించారు. వీరి పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

30న మార్షల్ ఆర్ట్స్ పోటీలు

తుమ్మపాల: మండలంలోని మర్రిపాలెంలో ఈనెల 30న జిల్లా స్థాయి స్పైక్స్ మార్షల్ ఆర్ట్స్ పోటీలను నిర్వహించనున్నట్టు స్పైక్స్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వనం సన్యాసిరావు, కార్యదర్శి యల్లబెల్లి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 ఏళ్ల లోపు జూనియర్స్, 18 ఏళ్ల పైబడిన సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తారని, ఆసక్తి గల కరాటే, తైక్వాండో క్రీడాకారులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 8179682841, 9573342621 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన రివిట్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్


రివిట్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులతో అధ్యాపకులు

తుమ్మపాల: సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు రివిట్ ఆర్కిటెక్చర్ కోర్సు అత్యున్నతమైనదని 'డైట్' ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు తెలిపారు. పట్టణంలో 'డైట్' ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 24 నుంచి నిర్వహిస్తున్న రివిట్ ఆర్కిటెక్చర్ వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను విద్యార్థి దశ నుంచే నేర్చుకోవాలన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎన్.రాము మాట్లాడుతూ సివిల్ ఇంజినీర్లకు ఇండస్ట్రీలో మంచి అవకాశాలు ఉన్నాయని, భవిష్యత్తును మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ప్రతి విద్యార్థి ఆచరణాత్మక విద్యను అభ్యసించాలని, ఈ వర్కుషాప్‌ల ద్వారా తక్కువ రోజుల్లోనే ఎక్కువ నేర్చుకోవచ్చని చెప్పారు. డీన్ డాక్టర్ కె.పార్వతి మాట్లాడుతూ రివిట్ ఆర్కిటెక్చర్‌తో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, బీఐఎం ఇంజినీర్లుగా దేశ విదేశాల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలలో స్థిరపడవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ ఐఈఐ కన్వీనర్ వై.హేమంత్‌కుమార్, ఏపీఎస్ఎస్‌డీసీ ట్రైనర్ దాలి నాయుడు, అసోసియేట్ డీన్ ఎ.కృష్ణనాగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న లూసిన్ ఫార్మా ప్రతినిధి వెంకట్

అనకాపల్లి రూరల్: మహిళలు సామాజిక,ఆర్థిక,రాజకీయ రంగాల్లో రాణించాలని లూసిన్ ఫార్మా డైరెక్టర్ వెంకట్ అన్నారు. తుమ్మపాల ది షేర్ మాక్స్ పరస్పర సహకార సంఘం సర్వసభ్యసమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సంఘం బలోపేతానికి సభ్య మహిళలు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు.ముఖ్యంగా చిరు ధాన్యాల పంటల సాగు కోసం సంఘంలోని మహిళలు కృషి చేయడం మంచి పరిణామన్నారు. సంఘం ద్వారా అందజేస్తున్న రుణాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కార్యవర్గ సభ్యులు కోరారు. సంఘం వార్షిక నివేదికను పాలకవర్గ అధ్యక్షుడు చదివి వినిపించారు.అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీఈవో కర్రి జోగినాయుడు, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్,అనకాపల్లి,కశింకోట మండలాలకు చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

బ్రహ్మాస్త్రం కషాయం తయారీపై అవగాహన


బ్రహ్మాస్త్రం కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కశింకోట: బ్రహ్మాస్త్రం కషాయాన్ని పంటలపై వినియోగించడం ద్వారా పురుగులను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం విభాగం మండల ఇన్‌చార్జి డి.రమణ తెలిపారు. మండలంలోని సుందరయ్యపేట, జి.భీమవరం గ్రామాల్లో స్వయం సహాయ సంఘాల సభ్య రైతులు, సాధారణ రైతులతో శనివారం బ్రహ్మాస్త్రం కషాయం తయారీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదు రకాల ఆకులతో ఈ కషాయాన్ని తయారు చేయాలన్నారు. ఇందుకు తక్కువ ఖర్చు అవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు సహజసిద్ధంగా తయారు చేసిన ఈ కషాయాన్ని వినియోగించడం వల్ల ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించవచ్చునన్నారు. సిబ్బంది లక్ష్మి, తదితరులు హాజరయ్యారు.

బైక్ రైడింగ్‌లో జాగ్రత్తలు అవసరం


అడ్డురోడ్డులో బైక్ రైడర్స్‌కి స్వాగతం పలుకుతున్న సీఐ అప్పన్న

ఎస్.రాయవరం : బైకు నడిపేవారు, యువత విధిగా జాగ్రత్తలు పాటించాలని నక్కపల్లి సీఐ అప్పన్న అన్నారు. బైకు రైడింగ్‌పై అవగాహన కల్పించేందుకు కాకినాడకు చెందిన యువకులు కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు ర్యాలీ చేపట్టారు. వారికి సీఐ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ యువత అవగాహన లేకుండా, హెల్మెట్లు లేకుండా బైకులు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు.

బైకు రైడింగ్‌పై అవగాహన కల్పించేందుకు కాకినాడ నుంచి విశాఖపట్నం వరకు రైడింగ్‌లో పాల్గొన్న, హవాక్ రైడర్స్ క్లబ్ యువకులను సీఐ అభినందించారు. మరింత మంది యువకులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ రైడింగ్ టీవీఎస్ వారి సహకారంతో చేపట్టినట్టు యువకులు చెప్పారు. కార్యక్రమంలో శ్రీనివాస్ , భరత్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు


అన్నప్రసాదాన్ని స్వీకరించేందుకు వేచి ఉన్న భక్తులు

నక్కపల్లి : మండలంలో ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో శనివారం కిట కిటలాడింది. అధిక శ్రావణమాసంలో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లాతో పాటు కాకినాడ జిల్లా నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. టీటీడీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత నెల నుంచి ప్రారంభమైన అన్నదాన కార్యక్రమం విజయవంతమైంది. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు పర్యవేక్షణలో ప్రతి శనివారం ఆలయానికి వచ్చే భక్తులకు అన్న ప్రసాదాన్ని అందిస్తున్నారు. సుమారు 400 మంది భక్తులకు పంపిణీ చేసినట్టు చెప్పారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులకు ప్రతి శనివారం మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందించడం సంతృప్తినిస్తోందన్నారు. అంతకుముందు కొండపై ఉన్న స్వామివారి నిజరూపానికి అర్చకులు పంచామృతాభిషేకం చేశారు. కొండ దిగువన ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన స్వామివారి ఉత్సవ మూర్తులు పుష్పమాల, పట్టు పీతాంబరాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ధూప, దీప నైవేద్యాలు, నీరాజన మంత్రపుష్పాలు, బాలభోగరాజ భోగ నివేదన చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తుల తాకిడితో ఆలయం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య


మృతదేహం (ఇన్‌సెట్) బాలాజీ(ఫైల్)

అనకాపల్లిటౌన్: అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణం చెందాడు. పట్టణ ఎస్ఐ దివాకర్‌యాదవ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక నాగవంశం వీధికి చెందిన జె.బాలాజీ(32) అమెజాన్ కంపెనీలో డెలివరీబాయ్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో జీవిస్తున్నాడు. అప్పులు ఎక్కువగా ఉండడంతో తీర్చలేక శనివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్ హుక్కుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి, భార్య సాయిపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి వేడుకలు


ఆకట్టుకున్న కాయగూరలతో శ్రీనివాసుని అలంకరణ


పారాయణం చేస్తున్న మహిళలు

మునగపాక : మండల వ్యాప్తంగా శనివారం ఏకాదశి పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఉదయం నుంచి భక్తులు తమ గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. చూచుకొండలోని కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. స్వామి విగ్రహాన్ని కాయగూరలతో అలంకరించి భక్తిని చాటుకున్నారు. స్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

వైభవంగా భక్తి పారాయణం

పాయకరావుపేట : స్థానిక రాధా రుక్మిణీ గోదా సమేత పాండురంగ దేవస్థానంలో శనివారం వికాస తరంగణి వేంపాడు శాఖ సంకల్పించిన 108 ఏకాదశిలలో తిరువాయిమొ జి.అర్ధ ఏకాహం నిర్వహించారు. తుని, పాయకరావుపేట వికాస తరంగణి శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో వెంకటాద్రి సహాయ సహకారాలతో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ యియ్యుణ్ణి నారాయణాచార్యులు, శ్రీమాన్ కృష్ణమాచార్యులు సంకల్పం చేయించి పారాయణ కార్యక్రమం ప్రారంభించి వైభవంగా జరిపారు. వికాస తరంగణి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.